కూరగాయల సాగు బాగు


ఆరేపల్లిలో వేసిన బోద కాకరకాయ తోట


పంగిడిపల్లిలోని బీర తోట

- ఆసక్తి చూపుతున్న రైతులు
- సహకారం అందించని ఉద్యానశాఖ

టేకుమట్ల: ఆహార ప్రధాన పంటల్లో కూరగాయల సాగు ఒకటి. కాగా గ్రామీణ ప్రాంత రైతులు సైతం ఇప్పుడిప్పుడే కూరగాయల సాగు వైపు అడుగులు వేస్తున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న కూరగాయల ధరలను దృష్టిలో ఉంచుకోని కూరగాయల సాగుకు మొగ్గు చూపుతున్నారు. మండలంలోని కలికోట, రాఘవాపూర్, ఆరేపల్లి, ఏంపేడు, ఆసిరెడ్డిపల్లి, సుబ్బక్కపల్లి గ్రామాల్లో కొంతమంది రైతులు కూరగాయలను సాగు చేస్తూ మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో విక్రయిస్తున్నారు. రైతులు ప్రధానంగా బీరకాయ, టమాట, కాకరకాయ, సొరకాయ, బెండకాయ, వంకాయ, బెబ్బరికాయ, అల్ చింత, క్యాబేజీ, బెండకాయ, బోడ కాకరకాయ, కొత్తిమీర, తదితర పంటలను పండిస్తోన్నారు. కూరగాయ పంటలను సాగు చేయడంలో ఇబ్బంది ఎక్కువే ఉన్న లాభాలు కూడా ఎక్కువే ఉంటాయని రైతులు తెలుపుతున్నారు. గతంలో మార్కెట్లోకి వచ్చే కూరగాయలను కొనుక్కునేవారు. కానీ ప్రస్తుతం రైతులు పండిస్తున్న పంట చేల వద్దనే ప్రజలు తక్కువ ధరకు ప్రజలు కొనుగోలు చేస్తున్నారు.

ప్రోత్సాహం అందించని హార్టికల్చర్ శాఖ

కూరగాయలు పండించేందుకు రైతులను హార్టికల్చర్ అధికారులు ఎలాంటి సహకారం అందించడం లేదు. హార్టికల్చర్ అధికారులు కూరగాయల సాగు రైతులకు ప్రోత్సాహం అందిస్తే మరింత సాగు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం కూరగాయల సాగు చేస్తున్న రైతులకు సరైన సలహాలు సూచనలు కూడా అధికారులు ఇవ్వడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూరగాయల సాగు రైతులను ఎప్పటికప్పుడు కలిసి సాగులో మెలకువలను సూచించాలని కోరుతున్నారు.

ఐదు సంవత్సరాలుగా సాగు చేస్తున్నా..



ఐదు సంవత్సరాలుగా కూరగాయల సాగు చేస్తున్నాను. కొన్ని సందర్భాల్లో నష్టాలను సైతం చూశా. కూరగాయల సాగులో మెలకువలను హార్టికల్చర్ అధికారులు సూచిస్తే మంచి లాభాలు వస్తాయి. ఇప్పటివరకు హార్టికల్చర్ అధికారులు ఎటువంటి సహాయాన్ని కానీ సబ్సిడీని కాని అందించలేదు.

– కిరణ్, రైతు పంగిడిపల్లి

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో చిట్యాల, టేకుమట్ల మండలాలకు చెందిన 80 మంది లబ్ధిదారులకు రూ.25 లక్షల 70 వేలు విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలను ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నాడని అన్నారు. అనంతరం టేకుమట్ల మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన సాద ఓదేలు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను స్థానిక సివిల్ ఆస్పత్రిలో పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి–సత్యం, చిట్యాల, టేకుమట్ల మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, కోటగిరి సతీష్ గౌడ్, తహసీల్దార్ షేక్ ఇమామ్‌బాబా, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు చిలుకల రాయకొమురు, దొడ్డి కిష్టయ్య, గుర్రం తిరుపతిగౌడ్, కొమురయ్య, బుర్ర లక్ష్మన్, సర్వ శరత్, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం


మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మల్హర్: జీఎస్టీ తగ్గించిన నేపథ్యంలో మండలంలోని కొయ్యూరు సెంటర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు బండ శ్రీకాంత్ పటేల్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. జీఎస్టీ తగ్గింపుతో సామాన్య ప్రజానీకానికి భారీ ఊరట లభించందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, ఉపాధ్యక్షుడు తోటపల్లి మహేందర్‌రెడ్డి, అజ్మీరా అక్కిరంనాయక్, వేమునూరి సతీష్‌రెడ్డి, కార్యదర్శి రాయమల్లు, సీనియర్ నాయకులు రమేష్, అశోక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో బతుకమ్మ సంబురాల్లో రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేడు (బుధవారం) సాయంత్రం ఐదు గంటలకు పాల్గొంటారని కాళేశ్వరం దేవస్థానం ఈఓ మహేష్, తహసీల్దార్ రామారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాళేశ్వరంలో దేవస్థానం రాజరాజేశ్వర వసతి గృహం వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ గ్రౌండు వద్ద సంబురాల్లో మంత్రి పాల్గొంటారన్నారు. అనంతరం రూ.90లక్షల వ్యయంతో దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెత్త దహన యంత్రం, అన్నదాన సత్రం, జమా మసీదు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం భవనం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత


చెక్కు అందజేస్తున్న గని మేనేజర్, కార్మికులు

భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని కేటీకే 1వ గనిలో విధులు నిర్వర్తిస్తూ మృతిచెందిన గండే సిద్ధార్థ కుటుంబానికి తోటి కార్మికులు అండగా నిలిచారు. ఈ మేరకు గనిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు, కార్మికులు రూ.2.23లక్షల విలువ గల చెక్కును మంగళవారం బాధిత కుటుంబానికి అందించి ఆర్థికంగా ఆదుకున్నారు. ఈ మేరకు గని మేనేజర్ తిరుపతి, సంక్షేమాధికారి కిషోర్ చేతుల మీదుగా సిద్ధార్థ భార్య జ్యోతికి అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు అన్ని కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సన్మానం


రాజేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

చిట్యాల: మండల కేంద్రంలోని వెలుగు మహిళా సమైక్య ఇన్‌చార్జ్ ఏపీఎం గుర్రపు రాజేందర్‌ను మంగళవారం అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నె యుగేందర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేష్, ఏవైఎస్ నాయకులు కట్కూరి రాజు, పుల్యాల సురేష్, ధర్మ సమాజ్ పార్టీ కోశాధికారి శీలపాక నాగరాజు, అంబేడ్కర్ వాదులు ప్రభాకర్, జీడీ సురేశ్, భాస్కర్, మైదం మహేశ్, గుర్రం తిరుపతి, పాముకుంట్ల చందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు


ప్రభాకర్‌రెడ్డి


మడక మధు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని బయాలజీ టీచర్ బి.ప్రభాకర్ రెడ్డి, బాలికల ఉన్నత పాఠశాలలోని ఫిజిక్స్ టీచర్ మడక మధు నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యార్థుల్లో ఇన్నోవేటివ్ అంశాలపట్ల ఆసక్తి పెంచుతూ, వినూత్న రీతిలో బోధనచేస్తూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు ప్రయత్నం చేస్తున్న వీరి సేవలను గుర్తించిన శారద ఎడ్యుకేషనల్ సొసైటీ నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు–2025 కు ఎంపిక చేసింది. ఈ నెల 25న హైదరాబాద్‌లో ఈ అవార్డులు ప్రదానం చేయనున్నారు. వారిని హెచ్‌ఎంలు అనిల్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు అభినందించారు.

నాణ్యమైన వంగడాలతోనే అధిక దిగుబడి


వరిని పరిశీలిస్తున్న అధికారులు

కన్నాయిగూడెం: నాణ్యమైన వంగడాలతోనే అధిక దిగుబడి వస్తుందని మండల వ్యవసాయ అధికారి ముంజ మహేశ్ అన్నారు. మండల వ్యవసాయ అధికారులు, యునివర్సిటీ వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం మండలంలోని పంటలను పరిశీలించారు. మండలంలో వేసిన నూతన వంగడమైన డబ్ల్యూజీఎస్ 962 వరి పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు గోన్య నాయక్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా దర్శనం


రెడ్డికాలనీలో పూజలో పాల్గొన్న మహిళలు




శ్రీశుభానందదేవి, శ్రీసరస్వతి అమ్మవారు

కాళేశ్వరం/భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయాలైన శ్రీశుభానందదేవి(పార్వతి), శ్రీసరస్వతి అమ్మవార్లు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గాయత్రీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. మంగళవారం ఆలయ అర్చకులు అమ్మవార్లను గాయత్రీదేవిగా అలంకరించారు. అర్చకులు విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం అందజేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన దుర్గామాతను కాలనీ మహిళలు, కుటుంబ సభ్యులు దర్శించుకొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

డీసీఎంఎస్ కేంద్రంలో ఎరువుల సీజ్


కాటారం: రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ, ఏఓ

కాటారం: నిబంధనలను విరుద్ధంగా యూరియా విక్రయించారనే ఫిర్యాదు మేరకు కాటారం మండలం గంగారం డీసీఎంఎస్–2 కేంద్రంలో నిల్వ ఉన్న ఎరువులను వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. గంగారం డీసీఎంఎస్–2కు ఈ నెల 21న యూరియా దిగుమతి అయింది. నిర్వాహకుడు ప్రకాశ్‌నాయక్ ఈపీఓఎస్‌లో నమోదు చేయకుండా, రైతులకు సరైన రశీదు ఇవ్వకుండా, ఏఓ అనుమతి లేకుండా అధిక ధరలకు అదే రోజు రాత్రి యూరియా విక్రయించాడు. పలువురు రైతులు వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్, కాటారం ఏఓ పూర్ణిమ డీసీఎంఎస్ కేంద్రాన్ని తనిఖీ చేసి విచారణ చేపట్టారు. కేంద్రంలో నిల్వ ఉన్న రూ.4,67,800 విలువ చేసే పలు రకాల ఎరువుల బస్తాలను సీజ్ చేసి స్టాప్‌సేల్ నోటీసు జారీ చేసినట్లు ఏఓ పూర్ణిమ తెలిపారు. లైసెన్స్ రద్దు కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్లు పేర్కొన్నారు. ఏడీఏ శ్రీపాల్ మాట్లాడుతూ యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాళేశ్వరం: మహదేవపూర్‌లోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం–2ను ఏడీఏ శ్రీపాల్, ఏఓ సుప్రజ్యోతి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఎలాంటి బిల్లులు లేకుండా ఆరు యూరియా బస్తాలు అక్రమంగా విక్రయాలు జరిపిన నేపథ్యంలో సంబంధిత నిర్వాహకుడికి సంజాయిషి ఇవ్వాలని షోకాజ్ నోటిసు అందజేశారు.

సదస్సును విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో నేడు (బుధవారం) నిర్వహించే మేధావుల సదస్సుకు జిల్లాలోని మేధావులంతా హాజరు కావాలని జిల్లా కాంగ్రెస్ దళిత చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ఈజీసీ కౌన్సిల్ సభ్యుడు దండు రమేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి హాజరు అవుతారని తెలిపారు. మేధావులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, నాయకులు జంపయ్య నాయక్, సమ్మయ్య, కరుణాకర్, రమేశ్‌రెడ్డి, జంగిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


రామకృష్ణను పరామర్శిస్తున్న మధుసూదనాచారి

టేకుమట్ల: మండలంలోని బూర్నపల్లి గ్రామానికి చెందిన నేరేళ్ల రామకృష్ణగౌడ్ దంపతులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో వారిని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మంగళవారం పరామర్శించారు. అలాగే మాజీ సర్పంచ్ నేరేళ్ల చేరాలు ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందగా ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంకుషాపూర్‌లో విద్యుత్‌ఘాతంతో మృతి చెందిన సాద ఓదెలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన చిలువేరు సారయ్య, గణేష్‌పల్లి గ్రామానికి చెందిన నాగలని కమలమ్మ, మేదరమేట్ల గ్రామానికి చెందిన ఐలమ్మ , ఆకినపల్లి గ్రామానికి చెందిన దూడపాక ఓదేలు ఇటీవల పలు కారణాలతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ ఫోరం మాజీ మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి, మాజీ సర్పంచ్ దానవేణి రాములు, ఉప సర్పంచ్ దార్ల ఆనంద్, రమేశ్, దేవుని కుమార్, తదితరులు ఉన్నారు.

పోషకాహారం సమృద్ధిగా తీసుకోవాలి


కాటారం: సీమంతం చేస్తున్న సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు


టేకుమట్లలో..

- అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వీణ

కాటారం: గర్భిణులు, బాలింతలు పోషకాహారం సమృద్ధిగా తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వీణ అన్నారు. కాటారం మండల దామెరకుంట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. పోష్టికాహారం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, ప్రీస్కూల్ విధానంపై తల్లులు, గర్భిణులు, మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పోషకాలతో కూడిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు, పాలు, గుడ్లు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించి గర్భిణులకు సీమంతం చేశారు. ఏఎన్‌ఎం విజయ, అంగన్‌వాడీ టీచర్లు జయలక్ష్మి, త్రివేణి, వసుమతి, కౌసల్య, ఆయాలు, ఆశాకార్యకర్తలు, తల్లులు, చిన్నారులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవాలు

టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(టి)అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, వనితల ఆధ్వర్యంలో మంగళవారం పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎదిగే పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు తప్పని సరిగా ఆకుకూరలను తీసుకోవాలన్నారు. అనంతరం పిల్లలకు హ్యాండ్‌వాష్‌పై అవగాహన కల్పించి, అక్షరాభ్యాసం చేయించారు. పంచాయతీ కార్యదర్శి కోమల, ఆశ కార్యకర్త సుజాత, ఆయాలు ఖతీజ, స్వప్న పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు పొందాలి

పలిమెల: ప్రతీ గర్భిణీ అంగన్‌వాడీ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఐరన్, కాల్షియం టాబ్లెట్స్ తీసుకుంటూ ప్రతీ నెలా వైద్య పరీక్షలు చేయించుకుంటూ మెరుగైన వైద్య సేవలు పొందాలని సీడీపీఓ రాధికరెడ్డి సూచించారు. పోషణ మాసంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో సూపర్‌వైజర్ శివరాణి అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ రాధికరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లల అభివృద్ధి ఏ వయస్సులో ఎలా ఉండాలనే దాని గురించి వివరించారు. కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పర్సంటేజ్ ఏ విధంగా ఉండాలని, వాళ్లు తీసుకునే ఆహారం గురించి, మోతాదు గురించి వివరించారు. ఆహారంలో ఎక్కువ శాతం చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి గర్భిణీలు, కిషోర బాలికలు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు సీమంతాలు, పిల్లలకు అక్షరాభాస్యం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు లక్ష్మి, మల్లికార్జున్, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

గోరింటాకుతో ఆరోగ్యం

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని మహర్షి డిగ్రీ కాలేజీలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో నాల్గో రోజు విద్యార్థినులకు మెహందీ కార్యక్రమం నిర్వహించారు. మెహందీ ద్వారా కలిగే ప్రయోజ నాలను వివరించారు. సంప్రదాయ పద్ధతిలో ఉపయోగించే గోరింటాకుతో అనేక ఆరోగ్య ప్రయోజ నాలు ఉంటాయని అన్నారు. కరస్పాండెంట్ పిచ్చిరెడ్డి, ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్, డైరెక్టర్ వెంకటరెడ్డి, అధ్యాపకులు రమ్య, కుమార్, నరేష్ ఉన్నారు.

మహిళా ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మహిళా ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలను వైద్యాధికారులు జ్యోతి, యోషిత నిర్వహించారు. ఈ సందర్భంగా 291 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు ఆశీష్, భాస్కర్, సిబ్బంది కోటి రెడ్డి ఉన్నారు.

బురదమయంగా రోడ్డు


రోడ్డుపై నిలిచిన నీరు

చిట్యాల: మండలంలోని చల్లగరిగ నుంచి ముచినిపర్తికి వేళ్లే ప్రధాన రోడ్డు బురదమయంగా మారింది. వర్షాలకు చల్లగరిగ గ్రామ పొలిమేర నుంచి వచ్చే వర్షపు నీరుతో పాటు గ్రామంలోని మురుగు నీరు రోడ్డుపైకి వస్తోంది. దీంతో రెండు గ్రామాల మధ్యలో ఉన్న రోడ్డుపై నీరు నిలిచి బురదమయంగా తయారైంది. వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన రావడంతో రోడ్డుపై నడిచే వారు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించి మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన


నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

భూపాలపల్లి అర్బన్: మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వైద్యులపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతా లోపంతో రోడ్డు నిర్మించారని నిరసన


నిరసన తెలుపుతున్న నాయకులు

కాటారం: మండల కేంద్రం నుంచి ధన్వాడ వరకు రూ.40 కోట్లతో నిర్మించిన ప్రధాన రహదారి నాణ్యత లోపంతో నిర్మించారని దీంతో కొన్ని రోజులకే అధ్వానంగా తయారైందని ఆరోపిస్తూ మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రహదారిపై ఏర్పడిన గుంతల వద్ద బైఠాయించి సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆత్కూరి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టిన కొద్ది రోజుల్లోనే నాణ్యతా లోపం బయటపడిందన్నారు. కాంట్రాక్టర్ కక్కుర్తి, అధికారుల అలసత్వం రహదారి నిర్మాణం నాణ్యత లోపంలో స్పష్టంగా కనిపిస్తుందని ఆరోపించారు. మంత్రి శ్రీధర్‌బాబు సొంత మండలంలో ఇలాంటివి చోటు చేసుకోవడం శోచనీయమని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు దేవేందర్, లడ్డు, తదితరులు పాల్గొన్నారు.